



Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com






ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 642 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర సోమవారం19 జనవరి 2026 పేజీలు : 4 వెల : అమూల్యం




## సాగునీటి ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు ఫోకస్..

### ఈ ఏడాదిలోనే పూర్తికి డెడ్‌లైన్

**సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రాధాన్యతల వారీగా చేపట్టాలని ఆదేశం**

**ఈ ఏడాదిలోనే వెలిగొండ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పూర్తికి లక్ష్యం**

**పూర్వోదయ స్కీం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన**

**దావోస్ పర్యటన నుంచి తిరిగొచ్చేలోగా నివేదికలు ఇవ్వాలని సీఎం ఆదేశం**

రాష్ట్రంలోని కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది (2026) లోపే వెలిగొండ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనులను పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. దావోస్ పర్యటనకు వెళ్లే ముందు అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన కీలక ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.గతంలో హంద్రీ-నీవా కాలువ వెడల్పు, పోలవరం పనులను వేగవంతం చేసిన తరహాలోనే ఈ ఏడాది వెలిగొండ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై దృష్టి సారించాలని సీఎం స్పష్టం చేశారు. త్వరలోనే తాను వెలిగొండ ప్రాజెక్టును సందర్శిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో పూర్వోదయ పథకం, పీపీపీ పద్ధతిలో చేపట్టాల్సిన ప్రాజెక్టులు, జల్ జీవన్ మిషన్ వంటి అంశాలపై చర్చించారు.పూర్వోదయ పథకం ద్వారా ప్రకాశం, రాయలసీమల్లోని 9 జిల్లాలను అభివృద్ధి చేయవచ్చని, ముఖ్యంగా ఉద్యాన రైతులకు ఇది ఎంతో మేలు చేస్తుందని సీఎం అన్నారు. ఈ ఏడాది 2 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు పండేలా చూడాలని సూచించారు. నల్లమల సాగర్ ప్రాజెక్టు విషయంలో కేంద్రంతో, పొరుగు రాష్ట్రంతో చర్చలు జరపాలని తెలిపారు. వృథాగా సముద్రంలోకి పోయే నీటిని వాడుకోవాలన్నదే ఉద్దేశమని, తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టుకు తాము అభ్యంతరం చెప్పలేదని గుర్తుచేశారు.పీపీపీ పద్ధతిలో చేపట్టేందుకు గుర్తించిన 290 ప్రాజెక్టులపై సమగ్ర జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. తాను దావోస్ పర్యటన నుంచి తిరిగి వచ్చేసరికి అన్ని ప్రాజెక్టులపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, సీఎస్ విజయానంద్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## ఏపీ సమాచార కమిషన్‌కు కొత్త సారథులు..

### . చీఫ్ కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావు

**ఆర్టీఐ కమిషన్‌కు నూతన నియామకాలు.. ఐదుగురు కమిషనర్ల ఎంపిక**

**ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్-ముఖ్యమంత్రి నేతృత్వంలోని కమిటీ సిఫార్సులకు గవర్నర్ ఆమోదం**

**నూతన కమిషనర్లు మూడేళ్లు లేదా 65 ఏళ్ల వయసు వరకు పదవిలో కొనసాగింపు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు (ఆర్‌టీఐ) కమిషన్‌కు ప్రభుత్వం కొత్త సారథులను నియమించింది. ప్రధాన సమాచార కమిషనర్‌గా (సీఐసీ) ప్రముఖ న్యాయవాది వజ్జా శ్రీనివాసరావును ఎంపిక చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నేడు ఉత్తర్వులు జారీ చేశారు.శ్రీనివాసరావుతో పాటు మరో నలుగురిని సమాచార కమిషనర్లుగా నియమించారు. వీరిలో వి. శరత్ చంద్ర కల్యాణ చక్రవర్తి, గాజుల ఆదెన్న (అనంతపురం), ఒంటేరు రవిబాబు (కడప), పరవాడ సింహాచలం నాయుడు (విశాఖపట్నం) ఉన్నారు. నియమితులైన వారంతా న్యాయవాద వృత్తికి చెందిన వారు కావడం గమనార్హం. ఈ కొత్త కమిషనర్లు మూడేళ్ల పాటు లేదా వారికి 65 ఏళ్లు వచ్చే వరకు (ఏది ముందైతే అది) పదవిలో కొనసాగుతారు.ముఖ్యమంత్రి అధ్యక్షతన, మంత్రులతో కూడిన సెలెక్షన్ కమిటీ చేసిన సిఫార్సులకు గవర్నర్ ఆమోదం తెలపడంతో ప్రభుత్వం ఈ నియామకాలను ఖరారు చేస్తూ గెజిట్ విడుదల చేసింది. ప్రస్తుతం కమిషన్‌లో ముగ్గురు సభ్యులు ఉండగా, తాజా నియామకంతో కమిషన్ బలం గణనీయంగా పెరిగింది. ఈ నియామకాలతో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుల పరిష్కారం వేగవంతం అవుతుందని, ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత మరింత పెరుగుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి




## మీడియాకు రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్

### మీరు, మీరు చూసుకోండి... మా మంత్రుల జోలికి రావొద్దు:

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియా సంస్థలపై తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. తమ మంత్రుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వార్తలు రాయవద్దని, మీడియా సంస్థల మధ్య ఏవైనా గొడవలుంటే తలుపులు మూసుకుని కొట్టుకోండి అని ఘాటుగా వ్యాఖ్యానించారు. సింగరేణి బొగ్గు గనుల కేటాయింపులో కుంభకోణం జరిగిందంటూ మీడియాలో వచ్చిన కథనాలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఖమ్మం జిల్లాలో పర్యటించిన ఆయన, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏదులాపురంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు.

ఈ సందర్భంగా మీడియాను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "మీకు గొడవలుంటే మీరు, మీరు చూసుకోండి. మా మంత్రుల జోలికి మాత్రం రావొద్దు. ఏదైనా రాసేముందు నన్ను వివరణ అడగండి, నేను ఎప్పుడైనా అందుబాటులో ఉంటాను. అంతేకానీ మా మంత్రులను బద్నాం చేయొద్దు. వారిపై వార్తలు వస్తే నా గౌరవానికి భంగం కలుగుతుంది" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు మీడియా సంస్థల మధ్య వివాదం నడుస్తోందన్న ప్రచారం నేపథ్యంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. బీఆర్ఎస్ నేతలు బలపడేలా తప్పుడు ప్రచారాలు చేయవద్దని ఆ రెండు మీడియా సంస్థలకు హితవు పలికారు.

అనంతరం సింగరేణి అంశంపై మాట్లాడుతూ, కొన్ని పత్రికలు బొగ్గు మాయమైందని, కుంభకోణం జరిగిందని అసత్యాలు రాస్తున్నాయని విమర్శించారు. "సింగరేణి టెండర్లను అనుభవం ఉన్న సంస్థలకే ఇస్తాం. ఇందులో ఏ మాత్రం అవినీతికి తావు లేదు. మా రెండేళ్ల పాలనలో ఎలాంటి అవకతవకలు జరగలేదు" అని ఆయన స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా నుంచే తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని గుర్తు చేసుకున్న రేవంత్, జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా రూ.362 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, ఆ ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డు పొందాలంటే ఎవరో ఒకరు చనిపోవాల్సిన దుస్థితి ఉండేదని, కానీ తమ కాంగ్రెస్ ప్రభుత్వం లక్షలాది మందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చిందని తెలిపారు. ఎన్టీఆర్ రూ.2కే కిలో బియ్యం ఇస్తే, తాము ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని, వైఎస్ఆర్ ఉచిత విద్యుత్ స్ఫూర్తితో 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తున్నామని వివరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను పేదలకు కేటాయించామని చెప్పారు.

భద్రాచలం అభివృద్ధిపై మాట్లాడుతూ, కేసీఆర్ రూ.100 కోట్లు ఇస్తానని మాట తప్పారని, తమ ప్రభుత్వం భూసేకరణ పూర్తి చేసి అయోధ్య తరహాలో భద్రాద్రిని అద్భుతంగా తీర్చిదిద్దుతుందని హామీ ఇచ్చారు. మంత్రులంతా సమన్వయంతో పనిచేస్తున్నారని, రాబోయే పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని, తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు





# నేటి నుండి మాఘమాసం ప్రారంభం

## - మాఘమాసం విశిష్టత ఏమిటి ?

'మఘం' అంటే యజ్ఞం. యజ్ఞయాగాది క్రతువులకు మాఘమాసాన్ని శ్రేష్ఠమైనదిగా భావించేవారు. ఈ మఘాధిపత్యాన క్రతువులు జరిగే మాసం గనుక మాఘమాసమైంది.
మాఘ స్నానం పవిత్రస్నానంగా భావిస్తారు. పాపరాహిత్యం కోసం నదీస్నానాలు చేయడం మాఘమాస సంప్రదాయం. మాఘస్నానాలు సకల కలుషాలను హరిస్తాయని భారతీయుల విశ్వాసం. మాఘస్నాన మహాత్మ్యాన్ని బ్రహ్మాండ పురాణం పేర్కొంటోంది. "మృకండుముని మనస్వినిల మాఘస్నాన పుణ్యఫలమే వారి కుమారుడైన మార్కండేయుని అపమృత్యువును తొలగించిందని పురాణ కథనం".
కల్యాణ కారకమైన ఈ మాసంలో చేసే స్నానం పరమ పవిత్రంగా భావిస్తారు. పాపరాహిత్యం కోసం నదీస్నానాలు చేయడం మాఘమాస సంప్రదాయం.
మాఘమాసంలో సూర్యుడు ఉన్న రాశిని బట్టి ప్రత్యూష కాలంలో సూర్యకిరణాలు ఒక ప్రత్యేక కోణంలో భూమిని చేరుతాయి. ఆ సమయంలో సూర్య కిరణాల్లో ఉండే అతినీల లోహిత, పరారుణ కిరణాల సాంద్రతల్లో మార్పులొస్తాయి. ఆధునిక శాస్త్రవేత్తలు సైతం జనవరి 20నుంచి మార్చి 30వరకు సూర్యోదయానికి ముందు చేసే స్నానాలు చాలా ఆరోగ్యవంతమైనవని, వేగంగా ప్రవహించే నీళ్లలో చేసే స్నానాలు శ్రేష్ఠమని పేర్కొంటున్నారు.
ఈ స్నానాలకు అధిష్ఠానదైవం సూర్య భగవానుడు. స్నానానంతరం సూర్యునికి అర్ఘ్యం సమర్పించడం ఒక ఆచారం.
మాఘమాసంలో సూర్యోదయానికి పూర్వం గృహస్నానంతోనైనా ఆరు సంవత్సరాల అఘమర్షణ స్నాన ఫలం లభిస్తుందంటారు. బావినీటి స్నానం పన్నెండేళ్ల పుణ్యఫలాన్ని , తటాక స్నానం ద్విగుణం, నదీస్నానం చాతుర్గుణం, మహానదీ స్నానం శతగుణం, గంగాస్నానం సహస్ర గుణం, త్రివేణీ సంగమ స్నానం నదీశతగుణఫలాన్ని ఇస్తాయని పురాణవచనం. మాఘ స్నానంలో దివ్య తీర్థాలను స్మరించి పాపవినాశనం కోరుతూ స్నానం చేయడం సంప్రదాయం. స్నాన సమయంలో 'ప్రయాగ'ను స్మరిస్తే ఉత్తమ ఫలం లభిస్తుందని విశ్వాసం.
మాఘ పూర్ణిమను 'మహామాఘం' అంటారు. ఇది ఉత్కృష్టమైన పూర్ణిమ. స్నానదాన జపాలకు అనుకూలం. ఈ రోజున సముద్రస్నానం మహిమాన్విత ఫలదాయకమంటారు.

**- మాఘమాసం మహిమ**

అఘము అనే పదానికి సంస్కృతంలో పాపము అని అర్థం. మాఘము అంటే పాపాలను నశింప చేసేది అనే అర్థాన్ని పండితులు చెబుతున్నారు. అందుకే మనకున్న మాసాలలో మాఘమాసం విశిష్టతను సంతరించుకుంది. ఇది మాధవ ప్రీతికరం. స్థూలార్థంలో మాధవుడంటే భగవంతుడు.
శివుడైనా, విష్ణువైనా, ఎవరైనా కావచ్చు. ఈ మాసంలో గణపతి, సూర్య తదితర దేవతల పూజలు, వ్రతాలు కూడా జరుగుతుంటాయి.




మాఘ విశిష్టతను గురించి ఈ మాసంలో ముఖ్యంగా సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించినప్పటి నుండి ఉదయకాలపు స్నానాలు చేయటం ఓ వ్రతంగా ఉంది. మాఘంలో ఎవరికి వారు వీలున్నంతలో నది, చెరువు, మడుగు, కొలను, బావి చివరకు చిన్ననీటి పడియలోనైనా సరే స్నానం చేస్తే ప్రయాగలో స్నానం చేసినంత పుణ్యఫలం అబ్బుతుంది. చలికి భయపడక ఉదయాన్నే నదీ స్నానం చేయటం సర్వోత్తమం.

**- తిథులు :-**

1. ఈ మాసంలో ఉదయాన్నే దీపారాధన, నువ్వులతో హోమం, నువ్వుల దానం, నువ్వుల భక్షణం లాంటివి ముఖ్యమైనవి. మాఘమాసంలో శుద్ధ విదియనాడు బెల్లం, ఉప్పు దానం చేయటం మంచిది.
2. శుద్ధ విదియ
3. శుద్ధ చవితి
4. శుద్ధ పంచమి
5. శుద్ధ షష్టి
6. శుద్ధ సప్తమి
7. అష్టమి
8. నవమి
9. ఏకాదశి
10. ద్వాదశి
11. త్రయోదశి
12. మాఘ పూర్ణిమ
13. కృష్ణపాడ్యమి
14. కృష్ణ సప్తమి
15. కృష్ణ ఏకాదశి
16. కృష్ణద్వాదశి
17. కృష్ణ చతుర్దశి
18. కృష్ణ అమావాస్య ఇలా మాఘమాసంలో ఎన్నెన్నో వ్రతాలు, పర్వదినాలు, వివిధ దేవతలను ఉద్దేశించి జరపుకోవటం కనిపిస్తుంది. అందుకే మాసానికి తొలినాళ్ళనుండి అంత విశిష్టత ఉంది.

ఈ మాసంలో వచ్చే ముఖ్యమైన తిథి "శుక్ల పక్ష చవితి" దీనిని "తిల చతుర్థి" అంటారు. దీన్నే "కుంద చతుర్థి" అని కూడా అంటారు. నువ్వులను తింటారు. నువ్వులతో లడ్లు చేసి పంచి పెడతారు. ఈ రోజున "డుంఢిరాజును" ఉద్దేశించి, నక్త వ్రతము పూజ చేస్తారు. డుంఢిని ఈ విధంగా పూజించడం వలన దేవతల చేత సైతం పూజలందుకుంటారని కాశీ ఖండములో తెలియజేశారు. "కుంద చతుర్థి" నాడు కుంద పుష్పాలతో పరమేశ్వరుని అర్పించి రాత్రి జాగారణ చేసినవారు, సకలైశ్వర్యాలను పొందుతారని కాలదర్శనంలో చెప్పబడింది. అయితే సాయంకాలం చతుర్థి ఉంటే ఉత్తమం అని ఈ సందర్భంలో తెలుసుకోవాలి.
మాఘమాసంలో ప్రాతఃకాలంలో చేసే స్నాన, జప, తపములు చాలా ఉత్తమమైనవి. ఈ మాసంలో స్నానం చేసేటప్పుడు "దుఃఖ దారిద్ర్య నాశాయ, శ్రీ విష్ణోతోషణాయచ ! ప్రాతఃస్నానం కరోమ్య, మాఘ పాప వినాశనం!" అని చేసిన తరువాత "సవిత్రేప్రసవిత్రేచ ! పరంధామజలేమమ ! త్వత్తేజసా పరిభ్రష్టం , పాపం యాతు





సహస్రదా !" అని చదవాలి. సూర్య భగవానునికి ఆర్ఘ్యమివ్వాలి.
ఈ మాసాన్ని కుంభమాసం అని కూడా అంటారు. కొంతమంది ఈ నెలనాళ్ళు ముల్లంగి దుంపను తినరు. ఈ మాసంలో నవ్వులను, పంచదారను కలిపి తినాలట. నువ్వులను దానమివ్వాలట. రాగి పాత్రలో గోధుమ రంగుగా ఉన్న నువ్వులను పాత్రతో సహా దానమిస్తే మంచిది. ఈ నెలలో మరణించిన వారికి అమృతత్వం సిద్ధిస్తుందట. "మాఘశుద్ధ పంచమి"ని శ్రీ పంచమి అంటారు. ఈ పంచమి నాడే "సరస్వతీదేవి" జన్మించిందట. ఈనాడు "రతీ మన్మధులను మల్లెపూలతో పూజిస్తారు.

ఉత్తర భారతంలో విష్ణుమూర్తిని, సరస్వతీదేవిని కూడా పూజిస్తారు. బ్రహ్మదేవుడు సృష్టి చేయగా చరాచర ప్రపంచం శ్మశాన నిశ్శబ్ధతతో ఉందట. అవేదనతో తన కమండలంలోని నీటిని ప్రపంచంపై చిలకరించగా చెట్లపై ఆ నీటి బిందువులు పడి ఒక శక్తి ఉద్భవించిందట. రెండు చేతులతో వీణను వాయిస్తూ మరో రెండు చేతులతో పుస్తకాన్ని మాలను ధరించి సమగ్ర రూపిణిగా దర్శనమిచ్చిందట. ఆ వగీశ్వరి వీణావాదనం ద్వారా ప్రపంచంలోని స్తబ్ధతను ఉదాసీనతను తొలగించి విద్యాబుద్ధులకు అదిష్టాత్రి అయింది ఆ దేవి.
**అప్పటి నుండి శ్రీ పంచమి రోజును సరస్వతిని పూజించడం జరుగుతుంది.**

ఇక మాఘశుద్ధ సప్తమి ఇదే "సూర్య సప్తమి"అని కూడా పిలువబడుతుంది. ఇదే రథసప్తమి సుర్య గ్రహణదినం వలె ఇది పరమపవిత్రమైనది. ఈ రోజున అరుణోదయకాలంలో ఏడు జిల్లేడు ఆకులను అందులో రేగికాయలను ఉంచుకొని తలాపై పెట్టుకొని స్నానం చేస్తే ఏడు విధాలైన శాపాలు నశిస్తాయట. స్నానికి ముందు చెరకుగడతో నీటిని కదిలిస్తారు. నమస్కారం ప్రియ:సూర్య: అన్న ఆర్య వాక్య ప్రకారం కేవలం నమస్కారం చేతనే సూర్యుడు సంతృపి చెందుతాడని తెలుస్తుంది. ఈ రోజున చిక్కుడుకాయలతో రథం చేసి కొత్త బియ్యంతో పాయసాన్ని వండి చిక్కుడు అకులలో పెట్టి సూర్యునికి నివేదన చేయడం ఆచారం.
సూర్యుడు తనను పూజించిన సత్రాజిత్తుకి ఈ రోజునే "శమంతకమణి" ప్రసాదించాడు. హనుమంతునికి వ్యాకరణ శాస్త్రాన్ని యజ్ఞవల్క్యునికి యజుర్వేదాన్ని బోధించాడు. ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్ అన్న వాక్యం ప్రకారం ఆరోగ్యం కొరకు ఆదిత్య హృదయం పారాయణ చెయ్యాలి. రథసప్తమి నాటి స్నానం సప్త సప్త మహాసప్త ద్వీపా వసుంధరా ! కోటి జన్మార్జితంపాపిం వినశ్యతితత్క్షణాత్ అన్నట్లుగా పాప విముక్తి కలిగిస్తుందట.
భీష్మాష్టమి "మాఘమానస్యచాష్టమ్యాం శుక్ల పక్షేచ పార్థివ !ప్రాజాపత్యేచ నక్షత్రే మధ్యఃప్రాప్తే దివాకరే !" శోభకృత నామ సంవత్సరంలో మాఘమాసంలో శుక్లపక్షంలో రోహిణి నక్షత్రం ఉన్న అష్టమి తిథినాడు మధ్యాహ్నం సూర్యుడు నడినెత్తిన ప్రకాశిస్తూ ఉండగా అభిజిత్ లగ్నంలో భీష్మ పితామహుడు ధ్యాన స్థితుడై ప్రాణాలను విడిచిపెట్టాడట. స్వచ్ఛంద మరణం ఆయనకి వరం.
ఆయనకు తర్పణలు విడిచి పెట్టడం నెలగంటు పెట్టినప్పటినుంచీ పెట్టిన గొబ్బెమ్మలను ఎండబెట్టి దాచి ఆ పిడకలతో పాయసాన్ని వండి నివేదన చేయడం ముఖ్యం. అష్టమినాడే దైవ సాయుజ్యం పొందినా శ్రీ కృష్ణుని సమక్షంలోనే విష్ణుసహస్రనామాలతో ఆయనను కీర్తిస్తూ మోక్షం పొందాడు. కాబట్టి ఏకాదశిని ఆయన పేరుతో ఏర్పాటు చేశారు. భీష్మ ఏకాదశి నాడు విశేష పూజలు చేయడం ఆనవాయితీ. ఇక మాఘమాసంలో వచ్చే ప్రతి ఆదివారాలు మహిమాన్వితాలే. ఈ విధంగా మాఘమాసమంతా "శివరాత్రి" వరకూ అన్ని పర్వదినాలే.


**- డా సునీల్ కుమార్ యాండ్ర**

**సంపాదకుడు, సింహగర్జన తెలుగు ఈ దిన పత్రిక**




# మండల తెదేపా ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి

తాళ్లరేవు, సింహగర్జన ప్రతినిధి, జనవరి 18 :
కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల




తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ (బాబి) ఆధ్వర్యంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి 31 వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అదేవిధంగా ఇంజరం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకుడు అంజి పేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముమ్మిడివరం నియోజకవర్గం శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు పాల్గొని నిరుపేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగ సూర్యనారాయణ, భాస్కర రాజు, జక్కల ప్రసాద్, మోర్తా భైరవమూర్తి, మోపురి వెంకటేశ్వరరావు, బోయిడి వేణుగోపాల్, ఆకెళ్ళ నాగేశ్వరరావు, టిల్లపూడి నాగేశ్వరరావు, దున్న సింహాద్రమ్మ, కాట్రు వీరేశ్వర రావు, కొప్పిశెట్టి చంటి, వడ్డీ విజయ్, గుంటముక్కల సూరి బాబు, హనుమంతరావు, పిల్లంక సుంకరపాలెం గ్రామ తెదేపా అధ్యక్షుడు కృష్ణవేణి, తాతారావు, సోమరాజు, నాగేశ్వరరావు, కోటి కాపు, సుంకర రామచంద్రరావు, బండారు దొర తదితరులు పాల్గొన్నారు



# క్రీడలతోనే శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం - దద్దాల

మార్కాపురం జిల్లా ప్రతినిధి, సింహగర్జన (ముత్యాల నరేష్ రెడ్డి) జనవరి 18 : క్రీడలు మనిషికి మానసిక ఉల్లాసాన్ని ఇవ్వడమే కాకుండా, శారీరక దారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయని వైయస్ఆర్‌సీపీ కనిగిరి నియోజకవర్గం ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ పేర్కొన్నారు. కనిగిరి మండలం వాగుపల్లి గ్రామంలో కీర్తిశేషులు మూలే కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన వాగుపల్లి మెగా క్రికెట్ టోర్నమెంట్ బహుమతులు ప్రదానోత్సవం కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొని ఫైనల్ మ్యాచ్ తిలకించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఓటమి మరో గెలుపునకు నాంది పలుకుతుందని, ఓడిన వారు నిరుత్సాహం చెందకుండా ముమ్ముందు గెలుపే లక్ష్యంగా పట్టుదలతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్య ఎలాగైతే మనిషికి జ్ఞానాన్ని ఇస్తుందో, క్రీడలు కూడా క్రమశిక్షణతో కూడిన జీవిత పాఠాలను నేర్పుతాయన్నారు. యువత క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ఫైనల్ మ్యాచ్ లో విజయం సాధించిన వాగుపల్లి హోం టీంకు మొదటి బహుమతి, రన్నరప్ గా నిలిచిన యంయస్ఆర్ జట్టుకు ద్వితీయ బహుమతి, మూడో స్థానంలో నిలిచిన వరిమడుగ జట్టుకు తృతీయ బహుమతులతో పాటు ట్రోఫీలను ఆయన అందజేసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ కు సహరించిన దాతలు మొదటి బహుమతి రూ.20,116/- సర్పంచ్ మూలే గోవిందరెడ్డి, ద్వితీయ బహుమతి రూ.15,116/- మూలే తిరుపతి రెడ్డి, తృతీయ బహుమతి రూ.10,116/- వీరంరెడ్డి సురేష్ బాబురెడ్డి, హోంటీం మరియు ఇర్మియ టీంకు జెర్సీ దాత మూలే గోపాల్ రెడ్డి, హోంటీంకు బ్యాట్ దాత వేటగిరి మల్లికార్జున వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మడతల కస్తూరి రెడ్డి, షేక్ అబ్దుల్ గఫార్, సర్పంచ్ మూలే గోవింద్ రెడ్డి, మూలే గోపాల్ రెడ్డి, వీరంరెడ్డి సురేష్ బాబురెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, పోలక సిద్ధారెడ్డి, ముల్లంగి శ్రీహరిరెడ్డి, సంగు వెంకటేశ్వర్ రెడ్డి, ముద్దబాబు, దమ్ము వెంకటయ్య, ముద్ద భాస్కర్, శివకృష్ణ, దాసరి మాల్యాద్రి, మిట్ట రమేష్ రెడ్డి, యాదగిరి మాల్యాద్రి, మేడం కృష్ణారెడ్డి, సంగు





తిరుపాల్ రెడ్డి, పోకూరి నారాయణ, నూకతోటి శ్రీను, పోకూరి బాలయ్య, ముప్పూరి రావు, సుబ్బరాయుడు, దాసరి నారాయణ, మాచర్ల రమణయ్య, మూలే వెంకట రెడ్డి, రమణారెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

# నేడు స్వర్గీయ వరుపుల తమ్మయ్య బాబు కాంస్య విగ్రహావిష్కరణ

ప్రత్తిపాడు, సింహగర్జన ప్రతినిధి, జనవరి 18 : సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామంలో జనసేన పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ కీర్తిశేషులు వరుపుల తమ్మయ్య బాబు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని లింగంపర్తి గ్రామస్తులు గ్రామ పెద్దలు తమ్మయ్య బాబు శ్రేయోభిలాషులు అందరూ కలిసి ఆయన తిరిగిరాని లోకానికి వెళ్లిన తమ అందరి మధ్య ఉంటారు అనే సాంకేతంతో లింగంపర్తి గ్రామ నడిబొడ్డున తమ్మయ్య బాబు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆయన పెద్ద కార్యం రోజున ఈ విగ్రహాన్ని ఆవిష్కరణ చేయడం జరుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ తమ్మయ్య బాబు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని తమ్మయ్య బాబుకి ఘన నివాళులర్పించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారని ప్రతి ఒక్కరికి తెలియజేస్తున్నామన్నారు.



# పేదల ఇల్లు.. ప్రభుత్వ బాధ్యత

## -: మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్, సింహగర్జన ప్రతినిధి, జనవరి 18 : "పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం" అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఆదివారం హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, వడ్డీ లేని రుణాలు, చీరల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా సిద్దిపేట రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'నమస్తే స్టాచ్యూ' ను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ రహదారిపై ఏర్పాటు చేస్తున్న క్రీడాకారుల విగ్రహాల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన 372 మందికి ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసిన మంత్రి గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఇల్లు కట్టుకునే వారికి 8 ట్రాక్టర్ల ఇసుక ఉచితంగా అందిస్తున్నట్లు ప్రకటించారు. మహిళా సాధికారతలో భాగంగా 3,520 మందికి రూ.1.13 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులను, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. నియోజకవర్గాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు గ్రామాల్లో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేశామని, ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే క్యాన్సర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. హుస్నాబాద్ ముఖచిత్రాన్ని మార్చేలా 250 పడకల ఆసుపత్రి, ఇంజనీరింగ్ కాలేజీ, ఎల్లమ్మ చెరువు వద్ద అద్దాల బ్రిడ్జి, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కరీంనగర్ నుంచి ఫోర్-లేన్ రోడ్డు, గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పి.మల్లవరంలో ఘనంగా రంగవల్లుల పోటీలు

తాళ్లరేవు, సింహగర్జన ప్రతినిధి, జనవరి 18 ; తాళ్ళరేవు మండల పరిధిలోని పి.మల్లవరం గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణం వద్ద సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ (బాబి) ఆధ్వర్యంలో "రంగవల్లులు" పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉంగరాల వెంకటేశ్వరరావు, విళ్ళ సత్యన్నారాయణ, ముత్యాల జయలక్ష్మి, ధూళిపూడి గొల్లబాబు, యంటి ధనలక్ష్మి, ధూళిపూడి సుబ్బారావు, శుభ, నీటి సంఘం ఉపాధ్యక్షుడు యడ్ల సుబ్బారావు, పితాని సత్యవతి, విష్ణు, పంపన చంద్రరావు, తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ పోటీలలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ వేసిన ముగ్గుకు మొదటి బహుమతి



లభించింది. ఈ బహుమతిని పి.ఆశా శ్వాతి గెలుచుకోగా, రెండవ బహుమతి పి.అనూష, మూడవ బహుమతి వై.వి.వి.లక్ష్మి, నాలుగో బహుమతి డి.కుమారిలు గెలుచుకున్నారు. అదేవిధంగా చిన్నారుల విభాగంలో ఏ.నయన ప్రథమ, ఎం.శ్రీలక్ష్మి ద్వితీయ, ఎం.రామ మానస తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. ఆయా బహుమతులను ధూళిపూడి వెంకటరమణ, నాయకులు కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో దడాల సత్తి కొండ, కిట్ట, సూర్య, నిమ్మకాయల సాయిరాం, నాగార్జున, స్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ ముగ్గులు పోటీలలో పాల్గొన్న అందరికి పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వ్యవసాయం పై అవగాహనా కల్పిస్తూ అందరికి టిష్యూ అరటి మొక్క, గుడ్డ చేతిసంచి, కాయగూరలు విత్తనాలతో కూడిన కిట్ మరియు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ధూళిపూడి సుబ్బరాయుడు మనువళ్ళు అమెరికాలో ఉంటున్న ధూళిపూడి సురేష్, కొమ్మిరెడ్డి రాజేష్ గాంధీ సహకారంతో నిర్వహించారు.




# సూర్యచంద్రులు ఉన్నంతవరకు ఎన్టీఆర్ పేద ప్రజలకు చేసిన సేవలు నిలిచే ఉంటాయి

### - చరిత్ర సృష్టించడం కోసమే పుట్టిన మహానేత ఎన్టీఆర్- తెలుగుజాతి చరిత్రలో ఎన్టీఆర్ కీర్తి అజరామరం

### - ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు - కొత్తపేటలో త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభం

కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, జనవరి 18 : విశ్వవిఖ్యాత నట సార్వభౌమ, మకుటం లేని మహారాజు స్వర్గీయ ఎన్టీఆర్ కీర్తి తెలుగుజాతి ఉన్నంతవరకూ అజరామరంగా నిల్చి ఉంటుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మహానుభావులు కొందరే ఉంటారని, చరిత్ర సృష్టించడం కోసమే ఎన్టీఆర్ వంటి మహనీయులు పుడతారని ఆయన అన్నారు. నందమూరి తారకరామారావు 30వ వర్ధంతి సందర్భంగా కొత్తపేట బస్టాండ్ సెంటర్ లో వాడపాలెంలో ఎన్టీఆర్ విగ్రహాలకు ఆయన, ఆకుల రామకృష్ణ నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పేదలకు వస్త్రదానం, అన్నదానం చేశారు. గవర్నమెంట్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, జ్యూస్ లతో కూడిన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధి కోసం కృషి చేసిన మహనీయుల్లో చిరస్మరణీయుడు నందమూరి తారకరామారావని ఎమ్మెల్యే బండారు అన్నారు. తెలుగుదేశం పార్టీని స్థాపించడం, తొమ్మిది నెలల కాలంలోనే చరిత్ర సృష్టించి అధికారంలోకి తీసుకురావడం ఆయనకే చెల్లిందని, తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని పెంపొందించిన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. కనీస అవసరాలు, కనీస సౌకర్యాలు పేద ప్రజలకు అందాలని రాజకీయాల్లోకి వచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. భూస్వాముల పాలన, జమీందారుల పాలనను ప్రజా పరిపాలనగా మార్చిన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. ప్రజా ప్రతినిధులు అంటే హైదరాబాదులోనే ఉంటారు, ప్రజలకు కనపడరు, ఎన్నికలు ఎప్పుడు వస్తే అప్పుడు మాత్రమే కనపడతారు అనే నానుడి ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రాకముందు ఉండేదని, దానిని మార్చి సామాన్యులను ఎందరినో రాజకీయాల్లోకి తీసుకువచ్చి, విద్యావంతులు ఎందరినో రాజకీయాల్లోకి తీసుకువచ్చి, రాజకీయాల్లో ఓనమాలు తెలియని వారిని ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా చేసిన ఘనత ఎన్టీఆర్ కు దక్కుతుందన్నారు. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడంలో



ఎన్టీ రామారావుకు ఎన్టీరామారావే సాటి అని కీర్తించారు. ఆనాడు ఆయన తీసుకున్న నిర్ణయాలు ఈనాటికి మన రాష్ట్రానికే కాదు దేశానికి ఆదర్శంగా ఉన్నాయని తెలిపారు. రెండు రూపాయలకే కిలో బియ్యం, పేదలకు పక్కా గృహాల నిర్మాణం, సగం నరికే చీర, ధోవతీ పథకం, రూ.50కే హార్స్ పవర్ విద్యుత్తు అందించడం, సింగిల్ విండో విధానంలో సహకార పరపతి సంఘాల్లో తక్కువ వడ్డీకే రుణాలు అందజేత, కరణం, మున్సబ్ వ్యవస్థల రద్దు, మండల వ్యవస్థ ఏర్పాటు, మహిళలకు ఆస్తి హక్కు కల్పించడం వంటి అనేక నిర్ణయాలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయన్నారు. మహిళలకంటూ గుర్తింపు వచ్చింది అంటే ఎన్టీ రామారావు తీసుకున్న నిర్ణయాలే కారణమన్నారు. ఆనాడు ఆయన తీసుకున్న నిర్ణయాలే నేటికీ శిరోధార్యంగా ఉన్నాయని అన్నారు. నాడు ఎన్టీఆర్ వృద్ధులకు, వితంతువులకు పింఛన్ అందించే పథకం తీసుకొచ్చారని, నాడు ఆయన ఇచ్చిన రూ.30ల పింఛన్ నేడు రూ.4వేలకు చేరిందన్నారు. పింఛన్ అయినా, పేదలకు బియ్యం పంపిణీ అయినా, జనతా వస్త్రాలైన, తెలుగు గ్రామీణ క్రాంతిపథం అయినా పేద ప్రజలే దేవుళ్ళుగా పరిపాలన చేసిన వ్యక్తి ఎన్టీ రామారావు అని కొనియాడారు.

ఆయన పరిపాలించింది కేవలం 7 ఏళ్ల 8నెలల కాలం అయినా అది ఒక చరిత్రగా నిలిచిందని, ఎన్టీ రామారావు పరిపాలన అంటే చరిత్రలో సువర్ణాక్షరాలుగా నిలిచిందన్నారు. నదుల అనుసంధానం కోసం తమిళనాడుకు తెలుగు గంగతో నీళ్లు ఇచ్చినా, నేడు జరుగుతున్న ప్రాజెక్టులకు సంకల్పం చేసినా ఎన్టీఆర్ తీసుకున్న నిర్ణయాలే అన్నారు. సూర్య చంద్రులు ఉన్నంతవరకు ఎన్టీఆర్ పేద ప్రజలకు చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. కొత్తపేటలో 2019 ముందు అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు రూ. 5లకే భోజనం అందించే వాళ్ళమని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అన్నా క్యాంటీన్లు రద్దుచేసి, పేదల చేతుల్లో అన్నం ముద్ద నేలపాలయ్యేలా చేశారని, తిరిగి త్వరలోనే కొత్తపేటలో అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ



నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించిన నందమూరి కుటుంబ సభ్యులు, సినీ ప్రముఖులు,అభిమానులు


హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, జనవరి 18 : విశ్వ విఖ్యాత నట సారభౌమ నందమూరి తారకరామారావు 30వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు, అభిమానులు, సినీ, రాజకీయ ప్రముఖులు ఆయనకు నివాళులు అర్పిస్తున్నారు. ఫిల్మ్‌నగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి సినీ పరిశ్రమకు చెందిన పలు శాఖల ప్రముఖులు పూల మాలలతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కాజా సూర్యనారాయణ మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రలో నంబర్‌వన్ ఎన్టీఆర్ అని, ఆయన ఆ రోజున తెలుగుదేశం పార్టీ స్థాపించకపోతే ఈరోజున చాలామంది రాజకీయాల్లో, పలు పదవుల్లో ఉండేవారు కాదన్నారు. తెలుగు ఇండస్ట్రీకి ఎన్టీఆర్, ఏయన్నార్ రెండు కళ్లు. ఇప్పుడు ఇద్దరూ లేరు. అక్కినేని నాగేశ్వరరావు విగ్రహం కూడా పెట్టాలని తన కోరిక అని తెలియజేశారు. అందుకు పరిశ్రమ పెద్దలు కృషి చేయాలని కోరుకుంటున్నా అని అన్నారు. నటుడు మాదాల రవి మాట్లాడుతూ తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి నందమూరి తారకరామారావు. తెలుగు జాతికి, తెలుగు సినిమాకు గుర్తింపు తీసుకొచ్చిన అలాంటి వ్యక్తికి భారతరత్న ఇవ్వాలని, దానికోసం మనమంతా కృషి చేయాలన్నారు. రచయిత పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ



'మనదేశం' చిత్రంలో ఎన్టీఆర్ చెప్పిన డైలాగ్ ప్రకారమే ఒక్కోమెట్టు ఎక్కుతూ ఏ స్థాయికి ఎదిగారో అందరికీ తెలిసిందే అని, ఆయన మనల్ని విడిచి 30 ఏళ్లు దాటినా ఇప్పటికీ మా అందరికీ సజీవంగా వచ్చి పలకరిస్తునట్టే ఉంటుందన్నారు. అన్నగారు లేరని ఏరోజు అనుకోలేదు అని అన్నారు. సినీ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని పెంచిన వ్యక్తి ఎన్టీఆర్. స్వార్థం లేని మనిషి ఆయన. సినిమాల్లో ఆయన చేయని ప్రయోగం లేదు.. కథ లేదు. అలాంటి వ్యక్తిని ఏడాదికి ఓసారి జయంతి, వర్ధంతులకు గుర్తు చేసుకొని, పూల మాలలు వేసి నివాళులు అర్పించడం కాదు.. రాజకీయంలో అయినా, సినిమాల్లో అయినా ఆయన్ను ఆదర్శంగా



తీసుకునే ధైర్యం ఉండాలన్నారు. ఇవాళ ఎంతమందిలో ఆ ధైర్యం ఉంది. ఆయనలా స్వార్థం లేకుండా ఈ రోజున రాజకీయం చేయగలరా? చేయాలనే ఆలోచన జనాల్లో రావాలంటే ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి నటుడికి నందమూరి తారకరామారావు ఓ శిక్షణాలయం. ప్రతి నటుడు, రాజకీయ నాయకుడు ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలి. తెలుగువాడి పౌరుషం, పరాక్రమం ప్రపంచానికి చాటి చెప్పి ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని నిర్మాత టి.ప్రసన్నకుమార్ అన్నారు. నిర్మాత, దర్శకుడు వై.వి.ఎస్.చౌదరి మాట్లాడుతూ చరిత్రలో గొప్ప వ్యక్తులకే విగ్రహాలు పెడుతుంటారు. తద్వారా భావితరాలకు వారి చరిత్ర తెలియాలని, కొందరు అవతార పురుషులు,



మహానుభావులకే జననం- మరణం అని కాకుండా జయంతి, వర్ధంతి అని చెబుతాం. అలాంటి ప్రయాణం ఎన్టీఆర్‌ది. వెండితెర వేల్పుగా నిలిచారు. అంకితభావం, కార్యదక్షత, క్రమశిక్షణగా ఉండి అగ్రగామిగా ఎదిగారు. మద్రాసీలు అని పిలవబడుతున్న మనల్ని తెలుగుజాతి అని ప్రపంచవ్యాప్తంగా మన ఉనికికి తెలిపారన్నారు. నందమూరి జానకీరామ్ భార్య దీపిక, మోహనరూప తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఎన్టీఆర్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు

# మౌన గీతం – 1981

విడుదల తేది : 19.06.1981 శుక్రవారం
క్రియేటివ్ కమర్శియల్ వారి
దర్శకత్వం : జె. మహేంద్రన్
సంగీతం : ఇళయరాజా
గీత రచన : ఆత్రేయ
తారాగణం : ప్రతాప్ పోతన్,సుహాసిని

విధి చేయు వింతలన్నీ మతిలేని చేతలేననిఽ అంటారు కానీ, ఆ వింత చేష్టలనే 'విధి లీల' అనీ చెబుతారు. సుహాసిని నటించిన తొలి చిత్రం 'నెంజత్తై కిల్లాదే'. దీని అర్థం 'మనసును గిల్లకు' అని. ఈ సినిమాను తెలుగులో 'మౌనగీతం' పేరుతో అనువదించారు. తమిళనాట ఘనవిజయం సాధించిన ఈ చిత్రం తెలుగులో 'మౌనగీతం'గానూ అలరించింది. అలా 'మౌనగీతం'తో సుహాసిని తెలుగువారిని పలకరించక ముందే ఆమె నటించిన తొలి తెలుగు చిత్రం 'కొత్తజీవితాలు' విడుదలయింది. ఆ సినిమాలో సుహాసిని అందం ఆనాటి కుర్రకారుకు బంధం వేసింది. దాంతో ఆమె తొలి చిత్రం 'నెంజత్తై కిల్లాదే' తెలుగులో 'మౌనగీతం'గా అనువదించి జనం ముందు నిలిపారు. క్రియేటివ్ కమర్షియల్స్ పతాకంపై కె.ఎస్.రామారావు 'మౌనగీతం'ను విడుదల చేశారు. విజయం సాధించారు. ఈ చిత్రానికి మహేంద్రన్ దర్శకుడు. ఆ రోజుల్లో మహేంద్రన్ దర్శకత్వం గురించి జనం భలేగా ముచ్చటించుకున్నారు. ఇక చిత్రమేమంటే, సుహాసిని భర్త మణిరత్నం అంతకు ముందు నాలుగు చిత్రాలు రూపొందించినా, ఆయన తొలిసారి విజయాన్ని చవిచూసింది 'మౌనరాగం'తోనే.


అలా 'మౌనం'తో సుహాసిని, మణిరత్నం ఇద్దరికీ అనుబంధం ఉంది. అంతేనా!? 'మౌనగీతం' కథలాగే 'మౌనరాగం' కూడా ఉంటుంది. అయితే, ఆ కథను ఇటు అటు చేసి మణిరత్నం మ్యాజిక్ చేశారని ఇప్పటికీ జనం అంటూనే ఉంటారు. మరి, అదే 'విధిలీల'! 'మౌనగీతం' తెలుగునాట 1981 జూన్ 19న విడుదలయింది.

**- ఇదీ 'మౌనగీతం'ఽ**

తన అన్నావదినలతో కలసి ఉంటుంది విజి. చాలా అల్లరి పిల్ల. ఆమెకు రాము అనే మెకానిక్ పరిచయమవుతాడు. విజి అన్న చంద్రశేఖర్ తన భార్యతో తరచూ గొడవ పడుతూ ఉంటాడు. విజికి, ఆమె వదినకు గొడవ జరుగుతుంది. వదిన స్నానం చేసే నీళ్ళలో కారం కలిపి సంబర పడుతుంది విజి. ఇక, విజి, రాము ప్రేమించుకుంటారు. పెళ్ళాడాలనుకుంటారు. విజి ఇంటికి రాము కన్నవారు వెళతారు. ఆ సమయంలో చంద్రశేఖర్, విజి ఇంట్లో ఉండరు. వారితో విజి మంచి అమ్మాయి కాదని, ఇప్పటికే అబార్షన్ చేయించుకుందని అబద్ధం చెబుతుంది ఆమె వదిన. ఆ విషయాన్ని రాము, విజిని అడుగుతాడు. తనపై నమ్మకంలేని రామును అసహ్యించుకుంటుంది విజి. తరువాత అన్న చెప్పిన తమ దూరం బంధువు ప్రతాప్ ను పెళ్ళాడుతుంది. అప్పుడు విజికి, ఆమె వదిన తాను ఎలా పగతీర్చుకున్నది చెబుతుంది. విజి బాధపడుతుంది. ప్రతాప్ ను భర్తగా అంగీకరించలేదు. కలకత్తాలో వారున్న ఇంటి పక్కనే రాము చేరతాడు. అతను ఓ దివ్యాంగురాలిని పెళ్ళాడి ఉంటాడు. తాను చేసిన ద్రోహానికి ప్రతిగా ఆ అమ్మాయిని పెళ్ళాడానని, తాను ఎంతో సంతోషంగా ఉన్నానని విజికి చెబుతాడు రాము. ప్రతాప్ తో విజిని ఆనందంగా ఉండమని కోరతాడు రాము. ప్రతాప్ ను తాను ఎంతగా బాధపెట్టానో అర్థం చేసుకున్న విజి, అతణ్ని చేరుకోవడంతో కథ సుఖాంతమవుతుంది.

**- గుర్తుకొస్తాయి మరి**

ఈ కథ విన్నప్పుడు తప్పకుండా మనకు మణిరత్నం 'మౌనరాగం' గుర్తుకు రాక మానదు. అందులోనూ నాయిక ఒకరిని ప్రేమించి, మరొకరిని పెళ్ళాడుతుంది. తాను ప్రేమించిన వాడు చనిపోయినా, అతణ్ణి మరచిపోలేక, భర్తతో సరిగా కాపురం చేయలేదు. చివరకు భర్త తనను ఎంతగా ప్రేమించాడో తెలుసుకొని, అతణ్ణి చేరుకోవడంతో కథ ముగుస్తుంది. పతాక సన్నివేశం కూడా ఒకేలా ఉంటుంది. కాకపోతే 'మౌనగీతం'లో ఎయిర్ పోర్ట్ లో సీన్, 'మౌనరాగం'లో రైల్ లో సీన్. అందువల్ల మణిరత్నంను 'మౌనరాగం' విడుదలయిన రోజుల్లో జనం బాగానే మోసేశారు. అయితే, ఈ రెండు చిత్రాలనూ విజయపథంలో పయనింప చేయడానికి ఇళయరాజా సంగీతం ఎంతగానో




ఉపయోగపడిందని చెప్పవచ్చు. 'మౌనగీతం'లోని "పరువమాఽ చిలిపి పరుగు తీయకుఽ" పాట యువతను ఆ రోజుల్లో భలేగా అలరించింది. ఈ పాటంతా సుహాసిని, మోహన్ ట్రాక్ షూట్స్ లో పరుగెత్తుతూనే ఉంటారు. అంతేకాదు, ఈ సినిమాను చూసిన ఎంతోమంది అమ్మాయిలు, అబ్బాయిలు అప్పట్లో ట్రాక్ షూట్స్ క్రేజీగా కొనుగోలు చేశారు. దర్శకుడు మహేంద్రన్ తరువాత ఛాయాగ్రాహకుడు అశోక్ కుమార్ కు ఈ సినిమా మంచి పేరు సంపాదించి పెట్టింది. తమిళనాట దాదాపు ఏడాది పాటు ప్రదర్శితమైన 'నెంజత్తై కిల్లాదే', తెలుగులో 'మౌనగీతం'గానూ వందరోజులు పూర్తి చేసుకోవడం విశేషం









Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com



## మారుతి యాదవ్ పాడే మోసిన తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం దారుల సంక్షేమ సంఘం

### - రాష్ట్ర అధ్యక్షులు బాపు మల్ శెట్టి

నారాయణఖేడ్ మున్సిపాల్ టౌన్ )
నారాయణఖేడ్ మున్సిపాల్ టౌన్ లో శ్రీ దత్తాత్రేయ కాలనీలో నాగల్ గిద్ద మండలం గూడూరు గ్రామానికి చెందిన కురుమ సంఘం నియోజకవర్గం నాయకులు మారుతి యాదవ్ గత కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఉదయము మృతి చెందారు. వారికి తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం దారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాపు మల్ శెట్టి పాల్గొని భౌతిక దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అంతక్రియలలో పాల్గొని పాడే మోశారు. వారితోపాటు గొర్రెల మేకల పెంపకం దార్ల సంక్షేమ సంఘం నియోజకవర్గం అధ్యక్షులు డి ఓం ప్రకాష్. మనూరు మండల అధ్యక్షులు దత్తుగౌండ. కురుమ ఉద్యోగుల సంఘం నాయకులు విట్టల్ టీచర్ .మనోహర్ టీచర్. నర్సింలు టీచర్. భాస్కర్ .నర్సింలు తదితరులు పాల్గొన్నారు

## హుగ్గెల్లి లో వైభవంగా పల్లె సంకీర్తన

జహీరాబాద్, జనవరి 18)
జహీరాబాద్ మండలం హుగ్గెల్లి గ్రామ హరేకృష్ణ మూమెంట్ నేత్రుత్వంలో ఆదివారం 155వ పల్లె సంకీర్తన వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన శ్రీ కృష్ణ భక్తులు సాంప్రదాయ వస్త్ర ధారణ ధరించి ఈ సంకీర్తన కార్యక్రమం లో పాలుపంచుకున్నారు. గ్రామ ప్రధాన ఆలయమైన శ్రీ ఆంజనేయ స్వామి మందిరం నుండి ఊరేగింపుగా బయలుదేరి శోభాయాత్ర నిర్వహించారు. చిన్నారులు వివిధ రకాల విన్యాసాలు చేస్తూ కీర్తనలకు అనుగుణంగా అడుగులు వేస్తూ 'ఔరా ' అనిపించుకున్నారు. శ్రీకృష్ణ, గోపిక వేశధారణలో శోభయాత్రలో పాల్గొన్న చిన్నారులను చూసి గ్రామస్థులు మురిసిపోయారు. ప్రధాన వీధులమీదుగా సాగిన ఈ శోభాయాత్ర జాతీయ రహదారిని చేరుకొని తిరిగి ఆంజనేయ స్వామి ఆలయానికి చేరుకొంది. ఈ కార్యక్రమం లోనూ సంగారెడ్డి జిల్లా కంది హరేకృష్ణ మందిరం బాధ్యులు విభిషణ్ ప్రభుజీ, చక్రం ప్రభుజీ లు పాల్గొని గ్రామస్థులకు హితోపదేశాలు తెలియజేసారు.





## క్షేత్ర సంకీర్తనలో హరేకృష్ణ టీం



జహీరాబాద్, జనవరి 18:
జహీరాబాద్ హరేకృష్ణ మూమెంట్ బృందం ఆదివారం మౌని అమావాస్యను పురస్కరించుకొని క్షేత్ర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. మాఘ మాసంలో వచ్చే మౌని అమావాస్య సందర్భంగా న్యాలకల్ మండలం రాఘవాపూర్ పంచవటి క్షేత్రంలో మంజీరా నది జలాలతో స్నానం చేసి సరస్వతి మాత దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకం చేసి వన భోజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అదే మండలంలోని అమీరాబాద్ గ్రామంలో పురాతన శ్రీ కృష్ణ మందిరంలో సంకీర్తన కార్యక్రమం జరిపారు. రెండున్నర గంటలపాటు ఏకధాటిగా సాగిన ఈ సంకీర్తన లో అమీరాబాద్ గ్రామస్థులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు. హరేకృష్ణ మూమెంట్ బృందం ద్వారా ఏర్పాటు చేసిన ఈ క్షేత్ర సంకీర్తన కార్యక్రమంలో లక్ష్మి వెంకటేష్ జాదవ్, ఉమా జాదవ్, వాణిశ్రీ, ఆకాంక్ష, రామ్ రతన్ సార్డా, వందన సార్డా, అజయ్ సార్డా, ఎన్నం రఘు, బాచా వెంకటేశం, అజయ్ కుమార్ న్యాల్కల్కర్,
మోహన్ రెడ్డి, సంగీత రెడ్డి, భువన రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీదేవి రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, మహేందర్ గోడకే, సవిత గోడకే, భరత్ ఓజా, సంకీర్తన గ్రూప్ కు సంబంధించిన మహిళా భక్తులు, గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు ఈ కార్యక్రమం లో పాల్గొని సంకీర్తన సభ్యులందరిని దీవించారు. గ్రామంలో కృష్ణ మందిరం అతి పురాతనమైనదని ఈ మందిరంలోని వేణుగోపాల స్వామిని దర్శించుకోవడం ద్వారా జన్మ ధన్యం అవుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు. నగర సంకీర్తన బృందం ప్రతి నెలలో ఒకరోజు క్షేత్ర సంకీర్తన నిర్వహించడం ముదావహమని కొనియాడారు. గ్రామస్థులు సైతం ఉత్సాహంగా సంకీర్తన కార్యక్రమం లో పాల్గొని నృత్యాలు చేశారు.

## వార్డు నం.33 శాంతినగర్ నుండి పార్టీ అభ్యర్థిగా టికెట్ మంజూరు కోసం వినతి

జహీరాబాద్ )



యూత్ కాంగ్రెస్ జహీరాబాద్ మండల ఉపాధ్యక్షుడు ఎం.డి. సామియుద్దీన్ (తండ్రి : మొహమ్మద్ ఫక్రుద్దీన్ మాజీ కౌన్సిలర్) రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో వార్డు నం.33 (శాంతినగర్), జహీరాబాద్ నుండి పార్టీ అభ్యర్థిగా పోటీ చేయుటకు పార్టీ టికెట్ మంజూరు చేయాలని కోరుతూ టౌన్ పార్టీ అధ్యక్షులు కండెం నర్సిములు కు దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత కొంతకాలంగా యూత్ కాంగ్రెస్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. వార్డు ప్రజలతో తనకు మంచి అనుబంధం ఉందని, పార్టీ సిద్ధాంతాలను ప్రజలలోకి తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు.



## కాంగ్రెస్ సీనియర్ నేత తులసి రెడ్డి ప్రత్యేక పూజలు


మార్కాపురం జిల్లా ప్రతినిధి, సింహగర్జన (ముత్యాల నరేష్ రెడ్డి) జనవరి 18 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ యన్.తులసి రెడ్డి ఆదివారం భైరవకోనను సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిముఖ దుర్గాంబ అమ్మవారిని, కాలభైరవేస్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిని ఆలయ అధికారులు శేష వస్త్రాలతో సత్కరించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం సెలయేరు వద్ద ప్రకృతిని ఆస్వాదించారు. వీరి వెంట పలువురు రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఓబీసీ డిపార్ట్మెంట్ స్టేట్ కోఆర్డినేటర్, నెల్లూరు, మార్కాపురం జిల్లా, కనిగిరి నియోజకవర్గం సి.యస్.పురం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎనుమల రమణయ్య యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు

## ఎన్టీఆర్ 30వ వర్ధంతి వేడుకలలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు బోయల్ల నారాయణరెడ్డి

మార్కాపురం జిల్లా ప్రతినిధి, సింహగర్జన (ముత్యాల నరేష్ రెడ్డి) జనవరి 18 : సి.యస్.పురం టిడిపి పార్టీ ఆఫీసులో ఎన్టీఆర్ 30వ వర్ధంతి వేడుకలు మండల అధ్యక్షుడు బొబ్బూరి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు బోయల్ల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు రూపొందించారని, అదే విధంగా పార్టీ కోసం ఎంతో కష్టపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకటరెడ్డి, సర్పంచ్ శ్రీ రామ్ పద్మావతి, పాములపాటి నరసయ్య, యన్.సి.మాలకొండయ్య, సి.యస్.పురం పట్టణ ప్రధాన కార్యదర్శి రేనాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




## చిన్నారి గంగ నిహారిక పుట్టినరోజు సందర్భంగా అన్న ప్రసాద వితరణ





మార్కాపురం జిల్లా ప్రతినిధి, సింహగర్జన (ముత్యాల నరేష్ రెడ్డి) జనవరి 18 : సి.యస్.పురం మండలంలో వెలిసి ఉన్న శ్రీ గంగమ్మ తల్లి దేవాలయంలో ప్రతి ఆదివారం అమ్మవారికి అభిషేకం మరియు భక్తులకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఆలయ పూజారి రామానుజచారులు తెలిపారు. అదే విధంగా ఈ ఆదివారం నన్నసాని మాల్యాద్రి యాదవ్ వారి ధర్మపత్ని రత్తమ్మ చిన్న కుమారుడు కృష్ణయ్య వారి ధర్మపత్ని నాగేశ్వరి వారి పిల్లలు కుమారుడు విష్ణువర్ధన్ కుమార్తె "గంగ నిహారిక" పుట్టినరోజు సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని పూజారి రామానుజచారులు తెలిపారు.

# అమావాస్య సందర్భంగా రామేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు

### -భక్తులకు అన్న ప్రసాదం చేసిన డప్పూర్ సంగమేష్





ఝరాసంగం)
ఝరాసంగం మండల పరిధిలోని కొల్లూరు రామేశ్వరుని ఆలయంలో అమావాస్య సందర్భంగా మండలం ని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు పూజారులు టేకుర్ స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సంగమేష్ దంపతులు అన్నప్రసాద ఏర్పాటు చేశారు. పూజలు అనంతరం అతిథులకు ఘనంగా సన్మానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది...ఈ కార్యక్రమములో మాజీ చైర్ పర్సన్ సునీత హనుమంత్ రావు పాటిల్,,సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ క్రాంతి పాటిల్, మాజీ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఉదయ్ శంకర్ పాటిల్,సర్పంచ్ చింతలగట్టు శివరాజ్, గ్రామ పెద్దలు నందు పటేల్, సర్పంచ్ లు అమృత్,నవీన్ పాటిల్,ఇమ్రాన్,సుభాష్, వేణుగోపాల్ రెడ్డి, సంగ్రామ్ పాటిల్, మారుతీరావు,మహేందర్ పాటిల్, షకీల్ అడ్వకేట్,శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సంగమేష్ పాటిల్,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్,ఆలయ చైర్మన్ రాజేందర్, సభ్యులు మొగులయ్య, సతీష్, నర్సింలు,నాయకులు వై నాగేష్,ఎం విష్ణు,కాశీనాథ్,నాగనాథ్,సి ప్రకాష్,సి సుబాష్ మరియు మండల పెద్దలు,ప్రజాప్రధినిధులు,అధికారులు,అనధికారులు, నాయకులు,యువకులు,మహిళలు,గ్రామ పెద్దలు,భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణి చేసిన తట్టు నారాయణ



జహీరాబాద్)
జహీరాబాద్ నియోజకవర్గ శాసన సభ్యులు కొనింటి మాణిక్ రావు ఆదేశాల మేరకు జహీరాబాద్ మండలంలోని,అల్గోల్,అర్జున్ నాయక్ తాండ,ఖాసీం పూర్,హోతి (బి )సత్వార్,మల్చేల్మా తాండ రాయిపల్లి (డి ) గ్రామాలకు సంబంధించిన పన్నెండు చెక్కులకు గాను మొత్తం 440500 /-నాలుగు లక్షల నలభై వేయిల ఐదు వందల రూపాయల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను జహీరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ మండల సర్పంచులు బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయా గ్రామాలకు వెళ్లి స్వయంగా అందజేశారు.కార్యక్రమంలో సర్పంచులు,మచ్చేందర్ ,రాజు ,చల్లా శ్రీనివాస్ రెడ్డి ,గోవర్ధన్ రెడ్డి ,ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు హీరు రాథోడ్ ,బిసి సెల్ అధ్యక్షులు ,అమిత్ కుమార్ , మాజీ సర్పంచులు , జగదీశ్ ,చందర్ చవాన్ ,విజయ్ ఆయా గ్రామాల బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు గ్రామ పార్టీ అధ్యక్షులు ,చెంద్రకాంత్ రెడ్డి ,గులాబ్ సింగ్ , విజేందర్ రెడ్డి ,పర్వేజ్ ,వీర్ శెట్టి ,సహీద్ , అల్గోల్ ఉపసర్పంచ్ బుజ్జమ్మ హోతి బి ఉప సర్పంచ్ విష్ణు ,సత్వార్ ఉప సర్పంచ్ నాగేష్ ,రాయిపల్లి ఉప సర్పంచ్ స్వామిదాసు ,మాజీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు శ్రీకాంత్ బక్కన్న,వైస్ అధ్యక్షులు అనిల్ కుమార్,ఆల్గోల్ మాజీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాహెర్ అలీ తదితరులు ఉన్నారు.